# మేలుకొనవే

శ్రీమద్వితీయ చరితామృత మన్నయార్యా
పీత్వాపినైవ సుహితా మనుజా భవేయు:
త్వం వేంకటా చలపతేరివ భక్తిసారం
శ్రీ తాళ్ళపాక గురుదేవ నమో నమస్తే

మేలుకొనవే నీలమేఘ వర్ణుడా
వేళ తప్పకుండాను శ్రీ వేంకటేశుడా
మేలుకో

1. మంచముపై నిద్రదేర మల్లెల వేసేరు
   ముంచి తురుము ముడువ మొల్లల వేసేరు
   కంచము వొద్దారగింప కలువలు వేసేరు
   పించపు చిక్కుదేర సంపెంగలు వేసేరు || మేలుకొనవే ||

2. కలసిన కానదేర గన్నేరుల వేసేరు
   వలపులు రేగి వరజాజుల వేసేరు
   చలువగా వాడుదేర జాజుల వేసేరు
   పులకించ గురువింద పూవుల వేసేరు || మేలుకొనవే ||

3. తమిరేగ గోపికలు తామరల వేసేరు
   చెమటార మంచి తులసిని వేసేరు
   అమర శ్రీ వేంకటేశ నలమేలుమంగ నీకు
   మమతల పన్నీటితో చేమంతుల వేసేరు || మేలుకొనవే ||

# తిరువీధుల మెరసీ దేవదేవుడు

తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను || తిరు ||

1. తిరుదండెల పైనేగీ దేవుడిదే తొలినాడు
సిరుల రెండవనాడు శేషుని మీద
మురిపేన మూడోనాడు ముత్యాలపందిరి క్రింద
పొరి నాలుగోనాడు పువ్వు కోవిల లోను || తిరు ||

2. గక్కన ఐదవనాడు గరుడుని మీద
ఎక్కెను ఆరవనాడు యేనుగు మీద
చొక్కమై ఏడవనాడు సూర్యప్రభలోనను
యిక్కువ తేరును గుర్ర మెనిమిదోనాడు || తిరు ||

3. కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు
పెనచి పదోనాడు పెండ్లిపీట
ఎనసి శ్రీ వేంకటేశుడింతి అలమేల్మంగతో
వనితల నడుమను వాహనాల మీదను || తిరు ||

# దేవ దేవుడెక్కెనదే దివ్యరథము

దేవ దేవుడెక్కెనదే దివ్య రథము
మావంటి వారికెల్ల మనోరథము

1. జగతి బాలులకై జలధులు పేరజేసి
పగటున తోలెనదె పైడి రథము
మిగులగ కోపగించి మెరయు రావణుమీద
తెగి ఎక్కి తోలినదె దేవేంద్ర రథము || దేవ ||

2. దిక్కులు సాధించి సీతాదేవితో అయోధ్య
పక్కన పరలిచే పుష్పక రథము
నిక్కి నరకాసురుపై నింగిమోవ నెక్కితోలె
వెక్కసపు రెక్కలతో విష్ణు రథము || దేవ ||

3. బలిమి రుక్మిణి తెచ్చి పరుల గెలిచి ఎక్కె
అల ఏగుపెండ్లి కళ్యాణ రథము
యెలమి శ్రీ వేంకటాద్రి నలమేలు మంగ గూడి
కలకాలమునూ యేగె ఘనమైన రథము || దేవ ||

# హరి నామము కడు ఆనంద రకము

హరి నామము కడు ఆనంద రకము
మరుగవో మరుగవో మరుగవో మనసా || హరి ||

1. నలినాక్షు శ్రీ నామము కలి దోషహరణము కైవల్యము
ఫలసారము బహుబంధ మోచనము తలచవో తలచవో తలచవో మనసా
|| హరి ||

2. నగధరు నామము నరక హరణము జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము పొగడవో పొగడవో పొగడవో మనసా
|| హరి ||

3. కడగి శ్రీ వేంకటపతి నామము ఒడి ఒడినే సంపత్కరము
అడియాలంబిల నత సుఖమూలము తడవవో తడవవో తడవవో మనసా.
|| హరి ||

# ఈ రూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము

ఈ రూపమై ఉన్నాడు ఇతడే పరబ్రహ్మము
శ్రీరమాదేవి తోడ శ్రీ వేంకటేశుడు

1. పొదలి మాయాదేవి పట్టిన సముద్రము
అది పంచభూతాలుండే అశ్వత్థము
గుదిగొన్న బ్రహ్మాండాల గుడ్లపెట్టే హంస
సదరపు బ్రహ్మలకు జలజమూల కందము || ఈ రూపమై ||

2. అనంత వేదాలుండే అక్షయ వటపత్రము
ఘన దేవతలకు శ్రీకర యజ్ఞము
కనలు దానవ మత్త గజ సంహార సింహము
మొనసి సంసార భారము దాల్చె వృషభము || ఈ రూపమై ||

3. సతతము జీవులకు చైతన్య సూత్రము
అతిశయ భక్తుల జ్ఞానామృతము
వ్రతమై శ్రీ వేంకటాద్రి వరముల చింతామణి
తతి గొన్న మోక్షపు తత్వ రహస్యము || ఈ రూపమై ||

# మాధవా కేశవా మధుసూదనా

మాధవా కేశవా మధుసూదనా విష్ణు
శ్రీధరా పదన ఖం చింతయామి యూయం || మాధవా ||

1. వామన గోవిందా వాసుదేవ ప్రద్యుమ్న
రామ రామకృష్ణ నారాయణాచ్యుత
దామోదరా నిరుద్ధ దైవపుండరీకాక్ష
నామత్రయాధీశ నమో నమో || మాధవా ||

2. పురుషోత్తమా పుండరీకాక్ష దివ్య
హరి సంరక్షణ అధోక్షజా
నరసింహా హృషీకేశ నగధరా త్రివిక్రమా
శరణాగత రక్ష జయ జయ సేవే || మాధవా ||

3. మహితా జనార్ధనా మత్స్య కూర్మ వరాహా
సహజ భార్గవ బుద్ధ జయ తురగ కల్కి
విహిత విజ్ఞాన శ్రీ వేంకటేశ శుభకరం
అహమిహ తవపద దాస్యం అనిశం భజామి || మాధవా ||

# పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయక వయ్య కోనేటి రాయడా || పొడగంటి ||

1. కోరిమమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పి దీర్చు కాలమేఘమా, మాకు
చేరువ చిత్తములోని శ్రీనివాసుడా || పొడగంటి ||

2. భావింప కైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా || పొడగంటి ||

3. చెడనీక బ్రతికించే సిద్ధ మంత్రమా, రోగా
లడచి రక్షించే దివ్యౌషధమా
బడి బాయక తిరిగే ప్రాణబంధుడా మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకట నాధుడా || పొడగంటి ||